మానేరుకు మట్టి గండం.!

- మట్టిపోసి మానేరును మాయం చేస్తున్న వైనం
- వందల సంఖ్యలో లారీలతో వేల టన్నుల మట్టి
- కాలువ కోసం తవ్వుతున్న మట్టి మొత్తం మానేరులోనే



చీర్లవంచ బ్యాక్ వాటర్‌లో పోస్తున్న మట్టి కుప్పలు

తంగళ్లపల్లి: కాంట్రాక్టరు కక్కుర్తి.. దానికి తోడు అధికారులు అలసత్వంతో వ్యవహరిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శ్రీరాజ రాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు ప్రాజెక్టు) బ్యాక్ వాటర్ సామర్థ్యం తగ్గిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్లతో మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మించగా, దాని నీటి నిల్వ సామర్థ్యం 25 టీఎంసీలుగా ఉంది. జిల్లాలో బీడు భూములను సస్యశ్యామలం చేస్తూ వ్యవసాయానికి, తాగునీటికి కొదువలేకుండా చేసేందుకు జలాశయాన్ని రూపొందించారు. ఇదిలాఉండగా కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారింది. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టు పరిస్థితి. అదనపు టీఎంసీ నీటిని తరలించేందుకు కాలువ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. అదే ఇప్పుడు మిడ్ మానేరుకు ముప్పుగా పరిణమిస్తోంది. కాలువ కోసం తవ్విన మట్టిని మిడ్ మానేర్ బ్యాక్ వాటర్‌లో పోస్తుండడంతో కొత్త సమస్య తలెత్తుతోంది.

బ్యాక్ వాటర్ మట్టి మాయం?

అదనపు టీఎంసీ పేరుతో టెండర్లు పిలిచిన ప్రభుత్వం కాలువ నిర్మాణానికి ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే కాలువను తవ్వి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ మాత్రం కొత్త ప్లాన్ వేశాడు. కాలువ తవ్వడం వలన వస్తున్న మట్టిని ఏకంగా మిడ్ మానేర్ బ్యాక్ వాటర్‌లోనే పోసే కొత్త ఎత్తుగడ వేసి గుట్టు చప్పుడు కాకుండా అమలు పరుస్తున్నాడు. దీంతో వేల టన్నుల మట్టి ప్రతిరోజూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో డంప్ అవుతునే ఉంది. ఇప్పటికే 20 ఎకరాలకు పైగా మిడ్ మానేరు బ్యాక్ వాటర్ మట్టితో నిండిపోయింది అంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో క్యాచ్‌మెంట్ ఏరియా తగ్గే ప్రమాదముంది.

రూ.వేల కోట్ల విలువైన మట్టి మాయం.?

25 టీఎంసీల నీటి సామర్థ్యంతో మిడ్ మానేరును సుమారు రూ.2 వేల కోట్లతో నిర్మించగా, కాలువ పేరుతో మట్టిని తవ్వి మానేరు బ్యాక్ వాటర్‌లో పోస్తుండడంతో నీటి నిల్వ సామర్థ్యం క్రమేపి తగ్గుతోంది. వేల కోట్లు వెచ్చించి నిర్మించిన జలాశయం అదనపు టీఎంసీ పనులతో ఆగం అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని పక్షంలో మిడ్ మానేర్ ప్రాజెక్టు ఉనికి ప్రశ్నగా మిగిలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



అదనపు టీఎంసీ కాలువ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మట్టిని తవ్వి మిడ్ మానేర్ బ్యాక్ వాటర్‌లో పోయడం సరికాదు. అధికారులు కూడా చోద్యం చూడడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– చొక్కాల రాము, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో తవ్విన మట్టిని మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో పోస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు నడుచుకుంటాం. – పి.సదానందం, తహసీల్దార్, తంగళ్లపల్లి

క్లుప్తంగా

తెలంగాణ విముక్తిపై జనజాగరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: తెలంగాణ విముక్తిపై అమృతోత్సవాల పండగను నిర్వహిస్తున్నట్లు అమృతోత్సవాల సమితి సభ్యుడు చిగురు వెంకన్న తెలిపారు. కొండాపూర్‌లో తెలంగాణ అమృతోత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు నిజమైన స్వాతంత్ర్యాన్ని 1948లో పొందారన్నారు. తెలంగాణ చరిత్రను స్వాతంత్రోద్యమాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనాలను జాగృతం చేసేందుకు ఈ నెల ఒకటి నుంచి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపల్లి ప్రణీత్‌కుమార్, దేవిరెడ్డి, విక్రం, సాయిరెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మానేరు నదిలో నాణ్యత లోపంతో చెక్‌డ్యామ్‌లు నిర్మించిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. ఆదివారం సర్దాపూర్‌లోని చెక్‌డ్యామ్‌ను సీపీఐ నాయకులు పరిశీలించి మాట్లాడారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఎగువ మానేరు నుండి మధ్య మానేరు వరకు 11 చెక్‌డ్యామ్‌లను నిర్మించేందుకు అనుమతులు తీసుకుందన్నారు. కానీ చెక్‌డ్యామ్ నిర్మాణ లోపంతో లీకేజీలు అవుతున్నాయన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ల చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపట్టారని, అట్టి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి, చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి చంద్రయ్య, మంచికట్ల రమేశ్, ఒగ్గు గణేశ్, అజ్జ వేణు, నాగరాజు, రాజమల్లు, మహేశ్ పాల్గొన్నారు.

పేద వైశ్యులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: గ్రామాల్లో నిరుపేద ఆర్య వైశ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీనివాస్ కోరారు. కోనరావుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. నిరుపేదలను డబుల్ బెడ్రూమ్, ఇతర స్వయం ఉపాధి రుణాల పథకాలలో లబ్ధిదారులుగా చేర్చాలన్నారు. వైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆదుకోవాలన్నారు. నాయకులు చేపూరి అశోక్, అనంతుల శ్రీనివాస్, పబ్బ సుధాకర్, జొన్నల శ్రీనివాస్, రాజేందర్, బొమ్మ సంతోష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన సీఐటీయూ నాయకులు



తరలివెళుతున్న సీఐటీయూ నాయకులు

తంగళ్లపల్లి: హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు ఆదివారం సీఐటీయూ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని సారంపల్లి-బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు వద్ద నుంచి తరలివెళ్తున్న బృందానికి నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ నాయకుడు కోడం రమణ మాట్లాడారు. ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నారని దానికి అనుబంధంగా ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సదస్సుకు జిల్లా నుంచి సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయం కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు.

అటెన్షన్ ప్లీజ్



మరమ్మతు మరిచిపోయారు

చందుర్తి: చందుర్తి మండలం ఎన్గల్- మల్లిగడ్డ గ్రామాల మధ్య గల పంచాయతీ రాజ్ శాఖ రోడ్డు కురిసిన వర్షాలకు రోడ్డు కోత గుర్రై కొట్టుకుపోయింది. మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, చందుర్తి
ఫోన్ నెంబర్: 98661 79335

చిత్రకథ



కంపుకొడుతున్న మురుగు కాలువ

కోనరావుపేట: మండలం కనగర్తిలో పాఠశాలకు వెళ్లే దారిలో బ్రహ్మంగారి ఆలయం పక్కన మురుగు కాలువ దుర్గంధాన్ని వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా కాలువలో చెత్తను తొలగించకపోవడంతో నిల్వ ఉండి దగ్గరికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు. ఇదే దారిలో ప్రతి రోజూ అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు వెళ్తుంటారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్, కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా స్పందించడంలేదని వంగపెల్లి భూపతి, కాలనీవాసులు ఆరోపించారు.

ప్రజల ఆస్తులను కాపాడుకుంటాం

- వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి



భూముల వివరాలను ప్రకటిస్తున్న చైర్‌పర్సన్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని ప్రజల ఆస్తులను తమ పాలకవర్గం కాపాడుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే భూకబ్జాలు జరిగాయని, అప్పుడు ప్రశ్నించని ఆది శ్రీనివాస్ పారదర్శకంగా పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మున్సిపల్ పాలకవర్గంపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మున్సిపల్ కార్యాలయం ముందు వారు ప్రభుత్వానికి చెందిన లే-అవుట్ భూములు, వివిధ భవనాల ఫొటోలను ఆదివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు వేములవాడ మున్సిపల్ ఆధీనంలో 12 ఎకరాల స్థలం ఉందన్నారు. ఇందులో నుంచి 122 గుంటల స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించినట్లు వివరించారు. కౌన్సిలర్లు శ్రీనివాస్‌రావు, సిరిసిరి చందర్, నరాల శేఖర్, మారం కుమార్, కో-ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, బాబూన్, కుమ్మరి శ్రీనివాస్, రామతీర్థపు రాజు, నాయకులు కొండ కనకయ్య, గూడూరి మధు, కందుల క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు ఎండగట్టాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

దసిరిసిల్లటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రజలను సన్నద్ధం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లలోని రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'హాత్ సే హాత్ జోడో అభియాన్'లో పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్ర ఈనెల 26న ముగుస్తున్న సందర్భంగా జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు గడప గడపకూ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పార్టీ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, వకుళాభరణం శ్రీనివాస్, గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

ఊరికి దూరంగా పోస్టాఫీస్



చెక్కపల్లి రోడ్డులో ఉన్న పోస్టాఫీస్

వేములవాడ: వేములవాడ ప్రధాన పట్టణంలో పోస్టాఫీసు అడ్రస్ దొరకడం కష్టంగా మారింది. సొంత భవనం లేక అద్దె ఇండ్లలో కొనసాగుతూ ఎక్కడెక్కడికో ఆఫీస్ మార్చుతుండటంతో పోస్టాఫీస్ సేవలు పొందేవారికి అవస్థలు కలుగుతున్నాయనీ మాజీ ధర్మకర్త, బీజేపీ నాయకులు నందిపేట సుదర్శన్ యాదవ్ గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పట్టణ నడిబొడ్డులో ఉండే పోస్టాఫీసును ఊరు చివరన ఏర్పాటు చేయడం సరైందికాదన్నారు. తక్షణమే పోస్టాఫీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పట్టణంలోకి తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో పలువురికి సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంటం నాగరాజు పంపిణీ చేశారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో 8 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎంపీపీ పిల్లి రేణుక అందజేశారు.

తంగళ్లపల్లి: మండలంలోని పలువులు లబ్ధిదారులకు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మధు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లెల్లలో దూమల నర్సవ్వకు రూ.60 వేలు, పద్మకు రూ.22 వేలు, చంద్రారెడ్డికి రూ.33 వేలు, మలయ్యకు రూ.17 వేలు, ఎల్లయ్యకు రూ.12 వేలు, మండెపల్లిలో అమరేందర్‌రెడ్డికి రూ.60 వేలు, కవితకు రూ.20 వేలు, లక్ష్మణ్‌కు రూ.17 వేలు, సుల్తానాకు రూ.13 వేలు చెక్కులు అందజేశారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

సిరిసిల్లఅర్బన్: విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హస్టళ్లు, పాఠశాలలో పర్యవేక్షణ కరువైందని, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో ఫుడ్‌పాయిజన్‌తో, దుమాలలోని ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో ఆహారం నాణ్యత లోపించడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఉద్యోగావకాశాలు

ఉపాధ్యాయులు కావలెను

కోనరావుపేట: మండలం మరిమడ్లలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న కోరారు. పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్‌లో ఒక్కో పోస్టు, జంతు శాస్త్రము రెండు పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన బోధించుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిమడ్లలోని పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సంఘాలు - ఎన్నికలు

యాదవ యువజన సంఘం అధ్యక్షుడిగా మహేశ్

ముస్తాబాద్: పట్టణ యాదవ యువజన సంఘం అధ్యక్షుడిగా శాగ మహేశ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆవునూరి దేవయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల బాలెల్లు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా అనమేని శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారిగా ఎస్.మహేశ్‌యాదవ్, రైటర్‌గా చెవుల బాలెల్లు యాదవ్ ఎన్నికయ్యారు.

యువమిత్ర యూత్ అసోసియేషన్ కార్యవర్గం

బోయినపల్లి: బోయినపల్లి యువమిత్ర యూత్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు ఆదివారం మండలకేంద్రంలో జరిగాయి. అధ్యక్షులుగా యాద ప్రేమ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా బొజ్జ రాజు, ఉపాధ్యక్షులుగా యాద ఆదిత్య, ప్రధానకార్యదర్శిగా నల్ల అనీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా దుద్దెల నవీన్, కోశాధికారిగా గడీల దినేశ్‌కుమార్, డైరెక్టర్‌గా చౌదరి శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా కంకణాల వెంకటేశ్, తునికి రాజు, బొజ్జ వెంకటేశ్, గూడూరి మహేశ్, బొజ్జ మధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం..

బోయినపల్లి: బోయినపల్లి మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కని లక్ష్మీనారాయణ, డివిజన్ ఉపాధ్యక్షుడు పులి హన్మాండ్లు ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్షుడిగా మంగళంపల్లి రాజేశం, గౌరవ అధ్యక్షుడిగా వేముల అశోక్, ఉపాధ్యక్షుడిగా పచ్చునూరి సుధాకర్, ప్రధాన కార్యాదర్శిగా బిల్ల గణేశ్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఆరెకుల సంక్షేమ సంఘం

బోయినపల్లి: ఆరెకుల సంక్షేమ సంఘం మండల కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా తిమ్మాపురం సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా ఎసిక మారుతి, ఉపాధ్యక్షుడిగా గుజ్జుల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సండెసరం రాజారామ్, కోశాధికారిగా ల్యాద రాంబాబు, కార్యవర్గసభ్యులుగా తిమ్మాపురం సత్తయ్య, బూర్గుల శ్రీనివాస్, తిమ్మారం లక్ష్మన్, గురిజాల కోటి, కందారపు శ్రీనివాస్, సండెసారం కిష్టయ్య, కందారపు తిరుపతి, కుసుంబ శేఖర్, భక్తపురం అంజి, గురిజాల శివాజీ ఎన్నికయ్యారు.

బాల్యమిత్రుడికి అండగా..



సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: పక్షవాతంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన పూర్ణచందర్ బాల్యమిత్రులు చేయూత మిత్ర ఫౌండేషన్ ద్వారా రూ.25 వేల నగదును ఆదివారం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు దూస శ్రీనివాస్, బందారపు లక్ష్మారెడ్డి, శ్రీధర్, నవీన్, గోపి, పర్శరాములు, ఆంజనేయులు, శ్రీరామ్, భాస్కర్, రాజు, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న దుర్గమ్మ ఆలయ నిర్మాణ పనులను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. సభ్యులు నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, ఎలగందుల నర్సింహులు, రమేశ్ ఉన్నారు.